# కంచె కౌగిట్లో...

ఉదయం పది గంటలయింది...!

అది ఆ ఊరి మున్సిఫ్ మెజిస్ట్రేటు కోర్టు... కోర్టు భవనం పురాతన హుందాతనంతో ఎత్తుగా ఉంది. కోర్టు గేటు నానుకుని పెద్ద గానుగచెట్టు ఉంది.

ఆవరణ అప్పటికే సందడిగా ఉంది...

కోర్టు వరండాలో జనం... మెట్ల మీద జనం... చెట్ల కింద జనం... కబుర్లు కలబోసుకుంటూ... సమస్యలు చర్చించుకుంటూ... స్వగతాలు వెళ్లబోసుకుంటూ..

నల్లకోట్లు ధరించిన వకీళ్లు నడిచి వస్తున్నారు. స్కూటర్లు దిగుతున్నారు. రిక్షాలు ఎక్కివస్తున్నారు. వకీళ్ల చుట్టూ జనం వలయాకారంలో మూగుతున్నారు. తమ వేడుకోళ్లు వినిపించుకుంటున్నారు.

వకీళ్ళు రావలసిన ఫీజులు రాబట్టుకుంటూ, అభయహస్తాలు అందిస్తున్నారు.

సమయం పదకొండు గంటలు!

కోర్టు జనంతో కిటకిటలాడుతోంది. తలపండిన మెజిస్ట్రేటుగారు మందహాసంతో వచ్చి తన సీట్లో సుఖాసీనులయ్యారు. పైన ఫ్యాన్లు నిర్విరామంగా తిరుగుతున్నాయి. కోర్టు గుమస్తాలు బంట్రోతులు, వకీళ్లు, వకీళ్ల గుమస్తాలు తమ తమ విధుల్ని న్యాయబద్ధ(క)ంగా మొదలుపెట్టారు.

సీలింగు ఫ్యానుకింద కూర్చున్న న్యాయమూర్తికి కేసు తర్వాత కేసు... వినివినీ ఆయనకు విసుగు పుడుతోంది. ఈ విసుగులో... ఆయన ఒక్క క్షణం కళ్లజోడు పైకెత్తి, కోర్టు బోనువైపు చూశారు. ఎందుకనో ఆయన భ్రుకుటి ముడిపడింది...

కోర్టు ఆవరణ సందడిగానే ఉన్నా ఎక్కువమంది గానుగచెట్టు కిందనే ఉన్నారు. ఎండ నిప్పుల కొండ పగిలినట్టుగా ఉంది. గానుగ చెట్టుకింద గవరయ్య కూల్‌డ్రింక్సు బండి ఉంది.

గవరయ్యకు బేరం చురుగ్గా సాగుతోంది. చిన్న చిన్న ఐసుగడ్డల్ని గ్లాసుల్లోకి చిత్రీపట్టి అందులో రంగు ఎస్సెన్సు పోసి... నిమ్మకాయ పిండి... నీళ్లు కలిపి, డ్రింకులు తయారు చేస్తున్నాడు. ఒకటీ, రెండూ రూపాయలకే పసందైన చల్లటి పానీయం...

దాహం వేసిన జనం, ఆవురావుమంటూ గవరయ్య డ్రింకులు తాగుతున్నారు.

ఆ ఎండవేళలో... కోర్టు ముందు నీలంరంగు పోలీసు వ్యాను ఒకటి వచ్చి ఆగింది. వ్యానులోంచి ఓ అరడజను మంది ఆడవాళ్లు దిగారు. ఆడవాళ్లతో బాటు ఇద్దరు పోలీసులు టోపీలు సర్దుకుంటూ దిగారు. వాళ్లతో బాటు హెడ్డు వీరాస్వామి దిగాడు.

ఆ తర్వాత వ్యాను ముందుభాగంలోంచి ఎస్.ఐ. రంగబాబు దిగి బూట్లు టకటకలాడిస్తూ లోపలికి వెళ్లిపోయాడు. హెడ్డు వీరాస్వామి తాపీగా జీపు దగ్గర నిలబడి ఫిల్టరు సిగరెట్టు వెలిగించుకున్నాడు.

ఆరుగురు ఆడవాళ్లు ఎకసక్కాలాడుకుంటున్నట్లుగా చెట్ల క్రిందకు చేరారు. వాళ్ళు చేరినచోటకే ఇద్దరు పోలీసులు అడుగులు వేశారు.

రంగురంగుల చీరలు... సీతాకోకచిలకలు... నీరసంగా... నిస్తేజంగా, చెట్లక్రింద వున్న జనంలో ఒక్కసారిగా చైతన్యం వచ్చింది. అందరి ముఖాల్లో జీవం తొణికిసలాడింది. అందరికళ్లు ఆ ఆడవాళ్లమీదే... తెలియని హుషారు... ఆనందం!

ఆడవాళ్లు ఆరుగురిలో ముగ్గురు చిన్నవయసులోనే ఉన్నారు. కండపుష్టి ఉంది. వయసు బింకాలు కొట్టొకొచ్చినట్టు కనపడుతున్నాయి. ఇద్దరు ప్రౌఢ స్త్రీలు, మరో స్త్రీ అటూ ఇటూ గాకుండా ఉంది.

వాళ్ల ముఖాలు వాడిపోయి వున్నాయి. కట్టుకున్న చీరెలు నలిగి ఏదో ఎబ్బెట్టుగానే ఉన్నారు. వాళ్లెవ్వరూ సిగ్గూలజ్జా ప్రదర్శించడం లేదు. అలాగని చలాకీతనం లేదు. ఒకళ్లిద్దరు తమలో తాము మాట్లాడుకుంటూ... చిన్నగా నవ్వుకుంటూ... చుట్టూవున్న జనాన్ని చూసీ చూడనట్టుగా చూస్తున్నారు. ముగ్గురు ఆడవాళ్లు గవరయ్య డ్రింకుబండి వద్దకు నడిచారు.

"బావగారూ! నోరెండిపోతంది... డ్రింకు ఇప్పించండి!" వయసులో బింకంగావున్న పిల్ల తన ప్రక్కనే ఉన్న పోలీసుని మేళమాడింది.

"సర్లేవే! నీ డ్రింకు తర్వాత ఇప్పిత్తాగానీ... ఓ రూపాయి చిల్లరుంటే ఇవ్వు... సిగరెట్లు - కొనుక్కోవాలి! నాలిక లాగేత్తంది!" పోలీసు ఒకడుగు ముందుకు వేసి ఆ పిల్ల చేయి పట్టుకున్నాడు. ఆ పిల్ల చేయి విసిరికొట్టింది. పోలీసు అర్థంలేని నవ్వొకటి నవ్వి సిగరెట్టు ఎక్కడ దొరుకుతుందాన్నట్లుగా చెట్లక్రింద జనాన్ని పట్టిపట్టి చూస్తున్నాడు.

హెడ్డు వీరాస్వామి ఏనుగులా అడుగులు వేస్తూ చెట్టు క్రిందకు వచ్చాడు. పోలీసువ్యాను కోర్టు ఆవరణలోంచి వెళ్ళిపోయింది. హెడ్డును చూసి గవరయ్య చిక్కగా డ్రింకుచేసి వినయంగా చేతికందించాడు.

"ఏరా! గవరయ్యా! ఈయేల బేరం జోరుగున్నట్టుందే నీకు..." హెడ్డు బోదురుకప్పలా పళ్లికిలించి డ్రింకు తాగుతూ అన్నాడు.

"అంతా తమరిదయ బాబూ!" గవరయ్య మరింత వినమ్రంగా అని గ్లాసు అందుకున్నాడు.

ముగ్గురు ఆడవాళ్లు గవరయ్య బండిదగ్గర డ్రింకులు త్రాగుతున్నారు. వాళ్లలో వాళ్లు తుళ్లిపడుతున్నట్టుగా నవ్వుకుంటున్నారు.

"ఏం టే... లం... ఎగిసిపడుతున్నారేటి...? ఎద్వాన్సుగా బేరాలు ఒప్పేసుకున్నారా

ఏటి...?" హెడ్డు బొజ్జ ఎగరేసుకుంటూ నవ్వాడు.

అతడి మాటలకు చుట్టూవున్న జనం శ్రుతి కలిపారు. ఆడవాళ్లు మాట్లాడలేదు. వాళ్ల ముఖాల్లో విషాదం... ఏదో ఉక్రోషం... కాస్త మెల్లకన్ను వున్న పిల్ల అయితే, హెడ్డువైపు కోపంతో చూసింది.

వాళ్లు ఒళ్ళమ్ముకునేవాళ్లు... కడుపుకోసం పడుపు వృత్తిన బ్రతుకుతూన్నవాళ్ళు... వాళ్ళను హేళన చేసే హక్కు అందరికీ వుంది. అదో ఆనందం... చెట్టుకింద చిలకల్ని, చిలకలు కట్టిన బొడ్డుకింద చీరల్ని... చీరల చౌకదనాల్లోంచి బయల్పడే ఒంపుసొంపుల్ని జనం ఆశగా, ఆబగా చూస్తున్నారు...

హెడ్డు వీరస్వామి సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ కోర్టు వరండాలోకి నాలుగుసార్లు వెళ్ళివచ్చాడు.

ఎస్.ఐ. రంగబాబు జాడ లేదు... అదిగో అప్పుడు కోర్టు వరండాలోంచి ఓ కేక వినపడింది.

ఆ కేక కోర్టు జవానుది. జవాను కేకకు, హెడ్డు వీరాస్వామి బదులు పలికాడు. బదులు పలకడంతో బాటు చెట్టుకింద ఆడవాళ్లను చూస్తూ...

"పదండెహే! పతివ్రొతా ముం...లు పదండి!" అంటూ ముందుకు నడిచాడు.

ఆ ఆడవాళ్ళు... "హమ్మయ్యా!" అనుకుంటూ కోర్టు వరండాలోకి అడుగులు వేశారు.

న్యాయమూర్తి కళ్లజోడు పైకెత్తి... భ్రుకుటిముడిచి బోనుదగ్గర నిలబడ్డ ఆడవాళ్ళను అసహనంగా చూశారు.

"మీ పేర్లు?" న్యాయమూర్తి స్వరంలో విసుగుదల కనిపించింది.

"మాణిక్యం... సుశీల... పాప... రజని... రాధ... పార్వతి" ఒకరి తరువాత ఒకరు ఆడవాళ్లు వరుసగా తమ పేర్లు చెప్పారు.

"మీరందరూ నేరం ఒప్పుకుంటున్నారా?" న్యాయమూర్తి అడిగారు.

"ఆ... ఒప్పుకుంటున్నామండి!" ఆడవాళ్ళు కోరస్‌గా అన్నారు.

" మీ అందరికీ తలా ఒక్కరికీ వందరూపాయలు జరిమానా విధిస్తున్నాను... ఇకపై నన్నా బుద్ధిగా వుండండి!" న్యాయమూర్తి తీర్పు చెప్పి తలవంచుకుని ఏదో రాసుకోసాగారు.

"ఆ పదండి పదండి!" అక్కడే వున్న హెడ్డు ఆడవాళ్ళని అదిలించాడు. ఆడవాళ్లు కదిలారు. మెల్లకన్ను వున్న పిల్ల మాత్రం కదల్లేదు.

"నేరం నేను ఒప్పుకోటంలేదండి...!" ఆ పిల్ల గొంతు విప్పింది. ఆ గొంతు స్ఫుటంగా వుంది.

మెజిస్ట్రేటు ఆశ్చర్యంగా, ఏవిటీ అన్నట్లుగా తలెత్తి చూశారు. ఆడవాళ్లందరూ అక్కడే ఆగిపోయారు.

"బాబూ! రామాటాకీసు సెంటర్లోనూ... రైల్వేస్టేషనుకెళ్లేదారిలోనూ... పబ్లిగ్గా - రోడ్డుమీద... పైటలు జార్చి... ఈలలు వేసి... బూతుమాటలతో... మగాళ్ళని ఎబిచారం సేయడానికి పిల్చామని, మాకు జరిమానా ఏశారు. బాబూ నిజంవే...! రాత్రి మాలో కొందరం ఎబిచారం చేశాం... మాతోబాటు ఎబిచారం చేసిన మగోళ్లకూ జరిమానా ఏస్తారా..." మెల్లకన్ను పిల్ల మెల్లమెల్లగా ఆగి ఆగి అడిగింది.

"నువ్వు చెప్పదలచుకున్నదేవిటో స్పష్టంగా చెప్పు...?" మెజిస్ట్రేటు గంభీర స్వరంతో అన్నారు.

"బాబూ! రాత్రి పన్నెండుగంటలకి మేవంతా స్టేషనుకెళ్లాం... ఇంట్లో ఎవరూ లేరని... మాలో సుశీల, బలవంతంగా ఎస్ఐ బాబు జీపెక్కి రాత్రంతా బాబుతో - సొంతపెళ్ళాంలా ఎబిచారం చేసింది... అది నేరవేగదా!

స్టేషను ఎనకాల చీకటిగదిలోకి విసురుగా లాక్కెళ్ళి... నన్నూ నా శరీరానివ నుగ్గునుగ్గుచేసి...

"మాణిక్యం నువ్వు నిజంగా మాణిక్యాని వేనే" అంటూ, ఏనుగులాటి హెడ్డుబాబు నన్ను తెగ మెచ్చుకుంటే... నేను ఎబిచారం చేశాను బాబు...

తనకు ఆకలిగా వుందనీ... ఒంట్లో నలతగా వుందనీ... మొరబెట్టుకున్నా వినక... మొరటుగా రెక్కబట్టుకుని ఈడ్చుకెళ్లిన ఓ సెంట్రీబాబుతో - జైలు గదిలోనే, మా పార్వతక్క ఎబిచారం చేసింది బాబు...

మాతో బాటు ఆ మగాళ్లు - నేరాలు చేశారు కదా బాబు... ఆ నేరాలకి శిక్షలేటో ధర్మప్రభువులు శెలవిస్తారనీ..."

మెల్లకన్ను పిల్ల అక్కడనుంచి తప్పుకుని ఆడవాళ్ళ మధ్యకు వెళ్ళి నిలబడింది.

అంతా నిశ్శబ్దం... ఎవరూ మాట్లాడటం లేదు...

మెజిస్ట్రేటు, పోలీసులవైపు ప్రశ్నార్థకంగా చూశారు...?

న్యాయదేవత తనను రక్షించే 'కంచె కౌగిట్లో' కళ్లు మూసుకునే వుంది...

* * * * * *

**(స్వాతి వీక్లీ - 20.11.98)**